

అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి కేశవ్

ఈకేవైసీ కుస్తీ..!



వచ్చే నెల నుంచి ఎన్ఎంఎంఎస్ అమలు.. ఈకేవైసీ పూర్తి అయిన కూలీలకే పని.. వేతనం

- జిల్లాలో 5,48,658 మంది ఉపాధి కూలీలు
- 3,78,867 మందికి ఐరిస్ సేకరణ పూర్తి
- మిగిలినవారికి రెండు రోజులే గడువు

అనంతపురం అర్బన్/రాప్తాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. నవంబరు నుంచి జిల్లాలో ఈ విధానం అమలులోకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నెల ఆరంభం నుంచి ఉపాధి కూలీలతో ఈకేవైసీ చేయిస్తున్నారు. ఈ విధానంలో ఉపాధి కూలీల ఐరిస్ ఫొటో తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెలాఖరులోపు ఈకేవైసీని పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నవంబరు నుంచి ఈకేవైసీ చేయించుకున్న కూలీలకు మాత్రమే వేతనాలు మంజూరు అవుతాయి. దీంతో ఈకేవైసీ పూర్తికాని కూలీలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 5,46,452 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో ఇప్పటి దాకా 382,394 మంది (69.98) ఐరిస్ సేకరణ పూర్తి చేశారు. మరో 1,64,058 మంది పెండింగ్ జాబితాలో ఉన్నారు. వీరికి ఈ నెలాఖరులోగా ఈకేవైసీని పూర్తి చేయాలి. దీనికి మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ లోగా పని పూర్తి చేయడం సాధ్యం కాదని డ్వామా యంత్రాంగం ఆందోళన చెందుతోంది.

పూర్తి అయితేనే పని..

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి కూలీల జాబ్ కార్డు నంబర్‌ను ఎంటర్ చేసి, ఐరిష్ ఫొటోను (రెండు సార్లు కళ్లు ఆర్పేలా) ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలి. ఈకేవైసీ పూర్తయితేనే ఉపాధి పనులకు అనుమతిస్తారు. వేతనాలు చెల్లిస్తారు. నవంబరు నెల నుంచి కూలీలు పని ప్రదేశంలో పని ప్రారంభించే ముందు ఒకసారి, పని ముగిశాక మరో సారి వ్యక్తిగత ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలా చేస్తేనే కూలీలకు వేతనాలు మంజూరవుతాయి.

ఆదిలో సర్వర్ సమస్య

ఈకేవైసీ ప్రక్రియ ప్రారంభించాక తొలి పది రోజులు సర్వస్ సమస్య వేధించింది. ఉదయం 9 గంటల్లోపు, సాయంత్రం 6 గంటల తరువాత మాత్రమే సర్వర్ పనిచేసింది. జాబ్‌కార్డు నంబర్ ఎంటర్ చేసి ఫొటో తీసే సమయం, అప్‌లోడ్ చేసే సమయంలో సర్వర్ మెరాయించింది. దీంతో ఆశించిన మేరకు ఈకేవైసీ పూర్తి కాలేదు. ప్రస్తుతం అప్పుడప్పుడు సర్వర్ సమస్య ఉత్పన్నం అవుతోంది. అయినా పలు మండలాల్లో ఈకేవైసీ ప్రక్రియను పీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చకాచకా చేసుకుంటూ వెళుతున్నారు. కొన్ని మండలాల్లో సిబ్బంది వెనుకంజలో ఉన్నారు.

నాతో ఈకేవైసీ చేయించారు



ప్రతి సంవత్సరం ఉపాధి పనులకు వెళుతున్నాను. ఏడాదిలో వంద పనిదినాలు సద్వినియోగం చేసుకుంటున్నాను. కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఈకేవైసి చేయలాని ఆదేశాలు ఇవ్వడంతో ఇంటి వద్దకు వచ్చామని సిబ్బంది చెప్పారు. నా ఫొటోతోపాటు జాబ్ కార్డు నంబర్‌ను యాప్‌లో ఎక్కించారు. - లక్ష్మీదేవి, ఉపాధి కూలీ, రాప్తాడు



శింగనమల మండలంలో ఉపాధి కూలీకి ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

క్లస్టర్ వారిగా పనితీరు..

- అనంతపురం క్లస్టర్ పరిధిలో బుక్కరాయసముద్రం, నార్పల, రాప్తాడు, అనంతపురం, ఆత్మకూరు మండలాలు ఉన్నాయి. ఈ క్లస్టర్‌లో 94,532 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఇప్పటి దాకా 62,797 మందితో (66.43 శాతం) ఈకేవైసీ చేయించారు. ఇంకా 31,735 మంది కూలీలు పెండింగ్‌లో ఉన్నారు.
- గుత్తి క్లస్టర్ పరిధిలో గార్లదిన్నె, శింగనమల, గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాలు ఉన్నా యి. ఈ క్లస్టర్‌లో 92,828 మంది కూలీలు ఉండగా... ఇప్పటి దాకా 68,321 మందితో (73.60 శాతం) ఈకేవైసీ చేయించారు. ఇంకా 24,507 మంది పెండింగ్‌లో ఉన్నారు.
- కళ్యాణదుర్గం క్లస్టర్ పరిధిలో బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు ఉన్నాం యి. ఈ క్లస్టర్‌లో 82,559 మంది ఉండగా.. ఇప్పటి దాకా 58,271 మందితో (70.58 శాతం) ఈకేవైసీ పూర్తైంది. ఇంకా 24,288 మంది పెండింగ్‌లో ఉన్నారు.
- రాయదుర్గం క్లస్టర్ పరిధిలో బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డి.హిరేహాళ్, రాయదుర్గం, కణేకల్లు మండలాలు ఉన్నాయి. ఈ క్లస్టర్‌లో 81,465 మంది ఉండగా.. ఇప్పటి దాకా 58,767 మందితో (72.14 శాతం) ఈకేవైసీ చేయించారు. ఇంకా 22,698 మంది పెండింగ్‌లో ఉన్నారు.
- తాడిపత్రి క్లస్టర్ పరిధిలో పుట్లూరు, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యాడికి, యల్లనూరు మండలాలు ఉన్నాయి. ఈ క్లస్టర్‌లో 1,06,023 మంది కూలీలు ఉన్నారు. ఇప్పటి దాకా 80,246 మందితో ఈకేవైసీ (75.69 శాతం) చేయించారు. ఇంకా 25,777 మంది పెండింగ్‌లో ఉన్నారు.
- ఉరవకొండ క్లస్టర్ పరిధిలో ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, బెళుగుప్ప, కూడేరు మండలాలు ఉన్నాయి. ఈ క్లస్టర్‌లో 89,045 మంది ఉండగా.. ఇప్పటి దాకా 53,992 మందితో (60.63 శాతం) ఈకేవైసీ చేయించారు. ఇంకా 35,053 మంది పెండింగ్‌లో ఉన్నారు.

మండలాల వారిగా పరిశీలిస్తే...

ఉరవకొండ మండలంలో ఉపాధి కూలీల ఈకేవైసీ పెండింగ్ జాబితా ఎక్కువగా ఉంది. ఈ మండలంలో 19,594 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఇప్పటి దాకా 9,724 మందితో (49.63 శాతం) ఈకేవైసీ చే యించారు. ఇంకా 98,070 మందితో ఈకేవైసీ చేయించాల్సి ఉంది. బుక్కరాయసముద్రంలో 7,919, వజ్రకరూరు 7,952, నార్పల 6,855, రాప్తాడు 6,747, విడపనకల్లు 6,301, బ్రహ్మసముద్రం 6,207, గార్లదిన్నె 6,308, శింగనమల 5,968, బెళుగుప్ప 5,738, బొమ్మనహాళ్ 5,642, పుట్లూరు 5,637, అనంతపురం 5,625, కళ్యాణదుర్గం 5,379, కూడేరు 5,326, గుమ్మఘట్ట 5,313, కంబదూరు 5,100, ఆత్మకూరు 5,079 మంది కూలీల ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. మిగతా మండలాల్లో 3,019 మంది నుంచి 4,942 మందిలోపు కూలీలతో ఈకేవైసీ చేయించాల్సి ఉంది.



● ఇది మంచి నిర్ణయం..

ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టి, పనులకు వెళ్లే కూలీలకు మాత్రమే కూలీ అందించాలని కేంద్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకోవడం మంచిదే. ఇక నుంచి పని ప్రదేశం వద్ద కూడా ప్రతి రోజూ రెండుసార్లు కూలీల పొటో తీస్తారంట. సర్వర్ సమస్య లేకుండా చూస్తే సిబ్బందికి సులభంగా ఉంటుంది. సర్వర్ సమస్యలు ఉంటే ఫొటో తీసేందుకేసమయమంతా సరిపోతుంది. ఈ విషయాన్ని గుర్తించి, పనులు చేసే సమయంలో సర్వర్ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సావిత్రి, ఉపాధి కూలీ, రాప్తాడు

● వేతనం కావాలంటే..

జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఉపాధి కూలీకి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల ఆరంభం నుంచి సిబ్బంది ద్వారా ఈకేవైసీ చేయిస్తున్నాం. తొలుత కొన్ని రోజులు సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడ్డారు. రెండు వారాలుగా ఈ ప్రక్రియ బాగానే సాగుతోంది. క్షేత్ర స్థాయిలో ఈకేవైసీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గడువులోగా ఈకేవైసీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. - సలీం బాషా, డ్వామా పీడీ



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అని, సీఎం చంద్రబాబు నేతృత్వంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, నాయకుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రజల అర్జీలను పరిశీలించి, వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

భూ సమస్యలను పరిష్కరించాలి: జేసీ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సమస్యలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని జేసీ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ, భూ బదలాయింపు, రీ సర్వే, ఈ పంట నమోదు, ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు, ఇతర రెవెన్యూ అంశాల గురించి సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జాతీయ రహదారులు 67, 510ఏ, 544, 52లకు సంబంధించి పెండింగ్ ఉన్న అనెక్షర్స్, రిపోర్టులు పంపించాలన్నారు. వివిధ రైల్వే ప్రాజెక్టుల పరిధిలో భూములకు సంబంధించి పెండింగ్ ఉన్న నివేదికలను ఆర్డీఓలు పంపించాలన్నారు. మాజీ సైనికులకు అసైన్‌మెంట్ భూమి కేటాయించేందుకు సర్వే చేసి ప్రతిపాదనలు తయారు చేసి వచ్చే నెల పదో తేదీ లోపు కలెక్టరేట్‌కు పంపించాలని ఆదేశించారు. కంబదూరు, గుత్తి పరిధిలో సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం లీజుకు సంబంధించి సర్వే పూర్తి చేసి నివేదికలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

1న పింఛన్ పంపిణీ: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు 1న ఉదయం 7గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. నవంబరు రెండో తేదీ ఆదివారం సెలవు కావడంతో తొలి రోజు పింఛన్ తీసుకోని లబ్ధిదారులు మూడో తేదీ మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు స్థానిక సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవాలన్నారు.

గుమ్మఘట్ట ఎంఈఓ-2 సస్పెన్షన్

అనంతపురం విద్య, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట ఎంఈఓ-2 రామచంద్రపై సస్పెన్షన్ వేటు పడింది. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ఆయన 2022లో పనిచేశారు. ఆ సమయం లో చేపట్టిన నాడు-నేడు పనులలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు ప్రత్యేకంగా విచారణ చేయించారు. ఆ సమయంలో డ్రా చేసిన రూ.12 లక్షలకు, చేసిన పనులకు వ్యత్యాసాలు ఉన్నాయని విచారణ అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై ఆర్జేడీ శామ్యూల్ షోకాజ్ జారీ చేశారు. నివేదిక ఆధారంగా రామచంద్రను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను రామచంద్రకు అందజేశామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. కాగా, నాడు-నేడు పనులలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఎం ఈఓ-2 రామచంద్ర అన్నారు. కమిటీ నిర్ణయాల మేరకే పనులు చేయించామని తెలిపారు. మూడు రోజులలో వివరణ ఇవ్వాలని ఆర్జేడీ నోటీసులు ఇచ్చారని, మొత్తం బిల్లులు, ఓచర్లు, రికార్డులను పరిశీలించి వివరణ ఇచ్చేందుకు సమయం కోరానని తెలిపారు. వివరణ తీసుకోకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేయడం దుర్మార్గమని అన్నారు.

పెద్దాసుపత్రిలో

డాక్టర్ల నిర్లక్ష్యం


- ఏ విభాగంలోనూ కుదురుగా లేని వైనం
- ఎమ్మెల్యే తనిఖీలకు వచ్చినా అదేతీరు
- రోగులకు తీవ్ర ఇబ్బందులు

7

మొంథా.. గుండెకోత..!

వేరుశనగ రైతుకు కన్నీటి కష్టాలు

- పూర్తయిన పంట కాలం
- తొలగించేందుకు తుఫాను అడ్డంకి
- మొలకలు వచ్చి పాడౌతున్న కాయలు
- తొలగిస్తే నానిపోతున్న కాయలు, కట్టె
- తగ్గిన దిగుబడులు.. ధర నేలచూపులు
- పెట్టుబడులు కూడా దక్కక నష్టాలపాలు



భూమిలోపలే మొలకెత్తిన కాయలు



పెద్దమట్లగొంది వద్ద వేరుశనగ పంట కాయల రాశిపై కవర్లు కప్పిన దృశ్యం

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ అన్నదాతను నష్టాలపాల్జేస్తోంది. దిగుబడులు రాకపోగా.. కాసిన కాయలు బరువు లేకపోవడంతో కొనే నాథుడే లేడు. వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారు. వారు అడిగిన రేటుకే ఇద్దామన్నా.. కొనేందుకు ముందుకు రావట్లేదు. మొంథా తుఫాను వర్షాల కారణంగా పంట తొలగించలేని దుస్థితి దాపురించింది. అలాగే ఉంచితే మొలకలు వస్తున్నాయి. తొలగిస్తే వర్షానికి వేరుశనగ కాయలు, కట్టె నానిపోతున్నాయి.

మండలంలోని పెద్దమట్లగొంది, చిన్నమట్లగొంది, సలకంచెరువు, ఈస్టునరసాపురం, సోదనపల్లి, గోవిందరాయునిపేట పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 2 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ఎకరాకి రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట సాగు సమయంలో వర్షాలు సకాలంలో పడడంతో ఏపుగా పెరిగింది. దిగుబడులు బాగా వస్తాయని (మిగతా 6లో..)

వర్షాభావంతో నష్టపోతున్న వేరుశనగ రైతును చివర్లో మొంథా తుఫాను పూర్తిగా ముంచేస్తోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పంట కాలం పూర్తయింది. తొలగించుకునే దశలో మొంథా తుఫాను చుట్టుముట్టింది. ఇప్పటికే భూమిలో కాయలు మొలకలు పోతున్నాయి. పంట తొలగించుకుంటే పశుగ్రాసంతోపాటు కాయలు నాని పనికిరాకుండా పోతాయి. పంట తొలగించుకుంటే దిగుబడి దక్కదు. తొలగిస్తే కాయలు, కట్టె రెండూ దక్కవు. కొందరు అలాగే ఉంచుతుంటే.. మరికొందరు పంట కోతలు చేస్తున్నారు. ఇద్దరూ నష్టపోతున్నారు. మొలకలుపోతున్న పంటతో, నానిపోతున్న దిగుబడులు, కట్టెతో రైతుకు గుండెకోత తప్పట్లేదు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- జువైనల్ హోంకు మైనర్ తరలింపు
- 10 తులాల బంగారం.. 1250 గ్రాముల వెండి స్వాధీనం

7



ఊడిన చైర్మన్ గిరీ

- కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్ తొలగింపు
- 10 నెలలుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా నిర్లక్ష్యం
- ప్రభుత్వానికి మున్సిపల్ కమిషనర్ లేఖ
- విచారణ అనంతరం చర్యలు



మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్

కళ్యాణదుర్గం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాలనను అటకెక్కించి 10 నెలలుగా కౌన్సిల్ సమావేశాలు కూడా నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించిన వైసీపీ కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తొలగించింది. పదవి నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వైసీపీ చీకటి రాజకీయాలకు తెరపడింది.

గుట్టుగా నిర్వహించాలని పట్టు..

మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ, 11 మంది టీడీపీకి చెందినవారు. చైర్మన్‌గా వైసీపీకి చెందిన రాజ్‌కుమార్‌ను అప్పట్లో ఎన్నుకున్నారు. గత వైసీపీ హయాంలో అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న ఉషశ్రీ డైరెక్షన్‌లో ఇష్టారాజ్యంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారన్నది బహిరంగ రహస్యమే. నాలుగు గోడల మధ్య సమావేశాలు నిర్వహించినట్లు, పనులకు ఆమోదం తెలిపినట్లు రికార్డుల్లో రాసేసుకుని, లక్షలాది రూపాయల నిధులు మింగేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూడా అదే తరహాలో రహస్యంగా సమావేశాలు నిర్వహించాలని భావించారు. అందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌పై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. అందుకు ఆయన ససేమిరా అన్నారు. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాల్సిందేనని పట్టుబట్టారు. అందుకు ఏమాత్రం ఇష్టంలేని మున్సిల్ చైర్మన్, వైసీపీ కౌన్సిలర్లు సమావేశాలు నిర్వహించకుండా అడ్డుపడుతూ వచ్చారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేయాలంటే కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. కౌన్సిల్ సమావేశమే నిర్వహించకపోవడంతో అభివృద్ధి పనులకు ఇబ్బందిగా మారింది. అత్యవసర పనులు కూడా చేయలేని దుస్థితి దాపురించింది. ఇదే విషయంపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేయడాన్ని ఆయన పలుమార్లు తప్పుబట్టారు. కౌన్సిల్ సమావేశం తేదీ తెలపాలని మున్సిపల్ కమిషనర్ రెండుసార్లు చైర్మన్‌కు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా లేఖ పంపారు. ఆయన తిప్పి పంపారు. దీంతో మొత్తం వ్యవహారాలను ఆధారాలతో మున్సిపల్ కమిషనర్.. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ మేరకు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం.. మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్‌ను తొలగిస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. చైర్మన్ పదవి నుంచి రాజ్‌కుమార్‌ను తొలగించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. మున్సిపాలిటీలోని ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరికి చైర్మన్ పీఠం అవకాశం ఉంది. ఆ తర్వాత కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నారు.

రిజిస్టర్డ్ పోస్టు చేసినా వెనక్కి పంపారు




మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తేదీని తెలపాలంటూ చైర్మన్‌కు రిజిస్టర్డ్ పోస్టు చేశా. దానిని వెనక్కి తిప్పి పంపారు. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని చాలాసార్లు విన్నవించాం. అయినా స్పందన లేదు. చేసేదిలేక విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా. విచారణ అనంతరం చైర్మన్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

- వంశీకృష్ణ భార్గవ్, మున్సిపల్ కమిషనర్

శోభాయమానంగా యాత్ర

- కసాపురంలో ప్రారంభమైన కలశ స్థాపన

గుంతకల్లు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో కలశ స్థాపనా ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కలశ స్థాపన, కుంభాభిషేక ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రాతఃకాల ఆరాధన, పరిషత్ విజ్ఞాపన, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల ప్రారంభ సూచికగా చేపట్టిన విశ్వక్సేన ఆరాధనా కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఉత్సవాలు పూర్తయ్యే వరకూ స్వాములకు, పండితులకు, కార్యక్రమ నిర్వాహకులకు జాత, మృతాశౌచాలకు విరుగుడుగా విశ్వక్సేన రక్షలను ధరింపజేశారు. ఆలయం నుంచి కలశాలను పాతగుంతకల్లులోని ఊరువాకిలి వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేర్చి శోభాయాత్రను నిర్వహించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. బాలికల శాస్త్రీయ నృత్యాలు, దేవతామూర్తుల వేషధారుల ప్రదర్శనలు, మేళతాళాలతో శోభాయాత్రను కసాపురం దేవస్థానం వరకూ కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, కృష్ణారెడ్డి, మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.



పురవీధుల్లో శోభాయాత్ర



విశ్వక్సేనార్చన కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తదితరులు

కనకదాస విగ్రహావిష్కరణకు రండి

● కలెక్టర్, ఎస్పీకి ఎంపీ, ఎమ్మెల్యే ఆహ్వానం



కలెక్టర్ ఆనంద్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గంలో నవంబరు 8న కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్, ఎస్పీని హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్‌కు కురుబ సంఘం నాయకులతో కలిసి వారు ఆహ్వాన పత్రికలు అందజేశారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నవంబ రు నెల 8న అధికారికంగా నిర్వహిస్తుందని, అదే రోజు కళ్యాణదుర్గంలో అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కళ్యాణదుర్గంలో కనకదాస సర్కిల్‌గా నామకరణం చేయనున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచి సబ్సిడీ పప్పుశనగ కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వింటా పప్పుశనగ పూర్తి ధర రూ.7800లు కాగా 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా రూ.5850 చెల్లించాలన్నారు.

విజ్ఞానం పొందేలా..

సైన్స్ సెంటర్ సందర్శనకు విద్యార్థులు.. రోజుకు 300 మంది వచ్చేలా ఏర్పాట్లు

● నవంబరు నుంచి అమలుకు ప్రణాళిక

● విద్య, సమగ్రశిక్ష అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అనంతపురం విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్ విద్యార్థులతో మళ్లీ కళకళలాడనుంది. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి, అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఈ సైన్స్ సెంటర్ గత కొన్నేళ్లుగా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో నిర్మానుష్యంగా కనిపించేది. అయితే ఇటీవల జిల్లాకు వచ్చిన కలెక్టర్ ఆనంద్ ఈ సైన్స్ సెంటర్ అభివృద్ధిపై దృష్టి సారించారు. ఇటీవల జరిగిన విద్య, ఎస్ఎస్ఏ శాఖల సమీక్షలో సైన్స్‌సెంటర్‌కు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకోసం ఈనెలాఖరు వరకు గడువు ఇచ్చారు. సైన్స్ సెంటర్‌కు అవసరమైన నిధుల కోసం సమగ్రశిక్ష ప్రాజెక్టు స్టేట్ డైరెక్టరు శ్రీనివాసరావుతో కలెక్టరు ఆనంద్ మాట్లాడి అంగీకరింపజేశారు.

ప్రణాళికలు సిద్ధం



సైన్స్ సెంటర్ సందర్శనకు రోజుకు 300 మందికి తగ్గకుండా విద్యార్థులు వచ్చేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమేరకు విద్యార్థులను సందర్శనకు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈనెలాఖరుకు ఏర్పాట్లు పూర్తి చేసి నవంబరు నుంచి సందర్శనకు విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. వచ్చిన పిల్లలకు ఇస్కాన్ ఏజెన్సీ ద్వారా మధ్యాహ్నభోజనం అందిస్తాం. అవసరమైన సిబ్బందిని నియమిస్తాం. - ప్రసాద్‌బాబు, డీఈఓ

రోజూ సందర్శనకు విద్యార్థులు

జిల్లాకేంద్రంలోని శారదానగర్‌లో ఉన్న సైన్స్ సెంటర్ సందర్శనకు ఇక రోజూ విద్యార్థులు రానున్నారు. ప్రతిరోజూ కనీసం 300మంది తప్పనిసరిగా సైన్స్ సెంటర్‌కు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు సైన్స్ సెంటర్‌ను సందర్శించి, ప్రాజెక్టులను పరిశీలించి, పరిజ్ఞానం పెంచుకునేలా కృషి చేయాలని కలెక్టర్ టార్గెట్ పెట్టారు. దీంతో డీఈఓ ప్రసాద్ బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ తన శాఖల సిబ్బందితో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నవంబరు 1 నుంచే సైన్స్ సెంటర్ సందర్శనకు ఏర్పాట్లు చేపడుతున్నారు.



సైన్స్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల యంత్రాలు



జిల్లా సైన్స్ సెంటర్

ట్రావెలింగ్ అలవెన్స్

సైన్స్ సెంటర్ సందర్శనకు వచ్చే విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ (ప్రయాణచార్జీ), మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నారు. జిల్లా శాఖ అధికారులు ఇచ్చిన ప్రణాళిక మేరకు మండల స్థాయి నుంచి ఎంఈఓ వివిధ పాఠశాలల విద్యార్థులను సైన్స్ సెంటర్ సందర్శనకు పంపాల్సి ఉంటుంది. సైన్స్ సెంటర్ సందర్శనకు వచ్చిన పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. డీఈఓ వీటిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆర్టీసీలో బాలికలకు ఉచిత ప్రయాణం ఉండటంతో బాలురకు ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వనున్నారు. ఈ బాధ్యతలు ఎస్ఎస్ఏ ఏపీసీ చూసుకోవాల్సి ఉంటుంది.

పూర్తిగా సహకరిస్తాం: శైలజ, ఎస్ఎస్ఏ, ఏపీసీ



సైన్స్ సెంటర్ విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని కలెక్టరు ఆదేశాలు ఇచ్చారు. ఆమేరకు ఎస్ఎస్ఏ ద్వారా అవసరమైన నిధులు, సిబ్బంది నియామకాలు చేపడతాం. సైన్స్ సెంటర్ సందర్శనకు దూరమండలాల నుంచి వచ్చే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రవాణాఖర్చులు అందజేస్తాం. ఇందుకు ఎస్పీడీ ఆమోదం వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మాశాఖ తరపున పూర్తి సహకారం అందిస్తాం.

స్వామి భూమి స్వాహా..!

● వీరభద్రుడికి అర్చక కుటుంబం శఠగోపం

● రీ సర్వేతో వెలుగులోకి.. ఆర్డీఓకు ఫిర్యాదు



వీరభద్రస్వామి విగ్రహం

కూడేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొర్రకోడు వీరభద్ర స్వామి మాన్యం భూమిని అర్చక కుటుంబం తమ పేరిట మార్చుకుంది. స్వామి సేవ చేస్తున్నందుకు ఆ భూమిని సాగు చేసుకునే అధికారం మాత్రమే చట్టబద్ధంగా అర్చక కుటుంబానికి ఉంది. కానీ అర్చకత్వం చేస్తున్న వైసీపీ మండల నాయకుడి కుటుంబ సభ్యులు స్వామి భూములను తమ పేరిట మార్చుకుని, పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకున్నారు. కూడేరు మండలం కొర్రకోడు సర్వే నంబర్ 117లో 23.73 ఎకరాలు, సర్వే నంబర్ 295లో 7.18 ఎకరాల భూమి 'వీరభద్రస్వామి నౌకరీ నిమిత్తం' అని డైక్లాట్‌లో స్పష్టంగా పొందుపర్చారు. స్వామి పూజ చేసే వారు ఆ భూమిని సాగుచేసుకునే వెసులుబాటు కల్పించారు. మాన్యం భూమిని రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారుగా వీరభద్రస్వామి పేరు, అనుభవం కింద అర్చకుల పేర్లు నమోదు చేయాలి. కానీ దేవుడి పేరును మాయం చేశారు.



వీరభద్రస్వామి భూములు

రీ సర్వేతో వెలుగులోకి..

కొర్రకోడు రెవెన్యూ గ్రామంలో అధికారులు రీ సర్వే నిర్వహించారు. ఆ సమయంలో స్వామి పేరిట ఉండాల్సిన భూమి అర్చకుల పేరిట మారినట్లు వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 117లో 7.62 ఎకరాలను అర్చకుల కుటుంబ సభ్యులు మీనాక్షి, ఫణిరాజు, పుష్పావతి, నాగరాజు, బండారి పాటిల్ మనోజ్, వరదరాజులు, విజయలక్ష్మి పేరిట ఆన్‌లైన్ చేశారు. ఇదే సర్వే నంబరులో (117/ఏ) వరదరాజులు, విజయలక్ష్మి పేరిట 5.93 ఎకరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. 295 సర్వే నంబర్‌లో దాదాపు 5.40 ఎకరాల భూమిని పెద్ద నాగభూషణ గౌడ్, చిన్న నాగభూషణ గౌడ్, వరదరాజులు, మధుబాబు, నాగరాజు, సతీష్‌గౌడు పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు.

ఆర్డీఓకు నివేదిస్తున్నాం..

కొర్రకోడు రెవెన్యూ పరిధిలోని 117, 295 సర్వే నంబర్లలో భూములు వీరభద్ర స్వామివి. వీటిని అర్చకులు తమ పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. దీనిపై దేవదాయ శాఖ అధికారులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. అర్చకులకు వీఆర్ఓ ద్వారా నోటీసులు పంపినా స్పందించలేదు. డైక్లాట్ ఆధారంగా వీరభద్రస్వామి భూములుగా పరిగణించి, ఆర్డీఓకు నివేదికను పంపుతున్నాం.

- మహబూబ్ బాషా, ఇన్‌చార్జి తహసీల్దారు

ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాం..

కొర్రకోడు వీరభద్రస్వామి భూములను అర్చకులు తమ పేరిట ఆన్‌లైన్ చేయించుకుని, పాసుపుస్తకాలు పొందారు. ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాము. ఆన్‌లైన్‌లో అర్చకుల పేర్లను తొలగించి, దేవుడి పేరును నమోదు చేయించాలని కోరుతూ నివేదిక ఇచ్చాం. అర్చకులు స్వామి భూములను తమ పేరిట నమోదు చేయించుకోవడం నేరం. ఆర్డీఓ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

-రమేష్‌బాబు, ఈఓ, కూడేరు మండలం

పాపంపేట ప్రజలకు భద్రత కల్పించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాపంపేటలో నివాసం ఉంటున్న 15 వేల కుటుంబాలకు భద్రత కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గణేనాయక్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీపీఏ పేరుతో కొందరు స్థానికులను ఏడాదిగా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. గ్రామంలోని 932 ఎకరాల శోత్రియం భూములలో ఐదు దశాబ్దాలకు పైగా ప్రజలు ఉంటున్నారని, అక్కడి భూమిని కొనుగోలుచేసి ప్లాట్లు వేసుకున్నారని, అప్పులు చేసి ఇళ్లను నిర్మించుకున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన జిల్లా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పాపంపేట భూ మాఫియాకు అండగా ఉంటున్న సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా గురువారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తామనితెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, సావిత్రి, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

చెరువులన్నీ నింపండి

ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువ కింద ఉన్న చివరి చెరువును కూడా నింపాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలసి అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం పీఏబీఆర్ ఇంజనీర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జలాశయంలోకే చేరే నీరు, ఎన్ని చెరువులు నింపే వీలుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాడిమర్రి మండలంలో ప్రతి ఏటా చెరువు నీరు వస్తుందన్న ఆశతో రైతులు పంటలు సాగుచేసి నష్టపోతున్నారని అన్నారు. అందుకే ఈసారి చివరి చెరువు వరకూ నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుమారు 115 కి.మీ. మేర కాలువ ఉందని, నీరు సరిపోకపోతే హంద్రీనీవా కాలువ నుంచి లింక్ కాలువ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

బొమ్మనహాళ్ ఎంపీపీ రాజీనామా?

నాలుగురోజుల కిందటే జడ్పీ సీఈఓకు లేఖ

బొమ్మనహాళ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తన పదవికి బొమ్మనహాళ్ ఎంపీపీ పద్మ రాజీనామా చేసినట్లు సమాచారం. నాలుగు రోజుల కిందటే రాజీనామా పత్రాన్ని జడ్పీ సీఈఓకు అందజేసినట్లు తెలిసింది. మరో రెండ్రోజుల్లో ఎంపీపీ రాజీనామాను ఆమోదించి, అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. మండలంలో ఉన్న మొత్తం 16 మంది ఎంపీటీసీలు వైసీపీకి చెందిన వారే. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు కావడంతో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తనకు అత్యంత సన్నిహితుడైన చంద్రశేఖర్‌రెడ్డి భార్య శ్రీధరఘట్ట ఎంపీటీసీ సభ్యురాలు పద్మను ఎంపీపీ స్థానంలో కూర్చోబెట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం ఎంతో కష్టపడిన ముల్లంగి నారాయణ స్వామి తన భార్య నాగమణి (ఉప్పరహాళ్ ఎంపీటీసీ)కి ఎంపీపీ పదవీ ఇస్తారని ఆశ పడ్డారు. దక్కకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందారు. దీంతో తొలుత రెండున్నరేళ్లు చంద్రశేఖర్‌రెడ్డి భార్యకు, ఆతర్వాత మిగిలిన పదవీకాలం నాగమణికి వర్తించేలా చేస్తానని చెప్పి సమస్యను కాపు సద్దుమణిగించారు. రెండున్నరేళ్ల తర్వాత కూడా ఇచ్చిన మాట నెరవేరకపోవడంతో ముల్లంగి సోదరులు 2024 ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిపోయారు. ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత కూడా నాగమణికి పదవి అప్పగించకపోవడంపై పలువురు ఎంపీటీసీ ప్రస్తుత ఎంపీపీ పద్మపై గుర్రుమని ఉన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ మినహా మిగతా సభ్యులంతా నాగమణికి మద్దతుగా నిలవనున్నారు. దీంతో కొత్త ఎంపీపీగా నాగమణి ఎంపిక కావడం తథ్యమని భావిస్తున్నారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 21 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

మొంథా.. గుండెకోత..!

(5వ పేజీ తరువాయి)

అన్నదాతలు ఆశపడ్డారు. పంట 70 రోజుల తరువాత వర్షాలు కురవక దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో కాయలు లొత్తలుగా ఏర్పడ్డాయి.

మొలకలతో నష్టం

పంట కాలం పూర్తయింది. వెంటనే తొలగించాల్సి ఉంది. ఈ సమయంలో మొంథా తుఫాను వచ్చి పడింది. ఈ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో పంట తొలగించుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో భూమిలోనే మొలకలు వస్తున్నాయి. దీంతో కొందరు రైతులు పంటను తొలగించారు. అవి కూడా నాని మొలకలు వస్తున్నాయి. కాయలు, కట్టె నానిపోతున్నాయి. కాయలపై మచ్చలు, బూజు ఏర్పడే ప్రమాదం ఉంది. పశుగ్రాసం కూడా కోల్పోవాల్సి వస్తోంది. ఎకరాకి 7 క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం క్వింటా ధర రూ.4 వేలు పలుకుతోంది. ఈ లెక్కన 7 క్వింటాళ్లకు రూ.30 వేలలోపే రైతుకు దక్కుతుంది. ఎకరాలో పెట్టుబడి రూ.50 వేలు పెట్టడంతో అందులో కూడా రూ.20 వేలు కోల్పోవాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

ధర నేలచూపులు..

పంట కోతల సమయంలో ధరలు అమాంతం పడిపోయాయి. 47 కిలోల బస్తా ధర కొన్నిరోజుల క్రితం వరకు రూ.3 వేలు పలుకుతుండేది. రైతులు పంట తొలగించుకుని వేరుశనగ కాయలు అమ్మడానికి సిద్ధం చేసుకున్నారు. ఇంటి వద్ద, పొలాల్లో రాశులు పోసుకున్నారు. కొనుగోలు చేయడానికి వస్తున్న వ్యాపారులు కాయలు లొత్తలుగా ఉన్నాయంటూ 47 కేజీల బస్తా రూ.2 వేలకే అడుగుతున్నారు. రైతులు విధిలేని పరిస్థితుల్లో ఆ ధరకే అమ్మేందుకు ముందుకొస్తున్నారు. ఆ తర్వాత కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రావడంలేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు.



మొలకలు వస్తాయని పంటను తొలగించిన రైతులు

అనుమతులు రాలేదు

మండలవ్యాప్తంగా వేరుశనగ పంట తొలగిస్తున్నారు. వర్షాలు అదునులో కురవకపోవడంతో పంట దిగుబడులు తక్కువగా వచ్చాయి. 9 గ్రామాల్లో కాయలు లొత్తలుగా ఉన్నాయని తెలుస్తోంది. వేరుశనగ కాయల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. అనుమతిస్తే కొనుగోలు చేస్తాం.

- అన్వేష్‌కుమార్, ఏఓ, శింగనమల

అడిగే నాథుడే లేదు



నాలుగెకరాల్లో పంటను తొలగించి వారం రోజులు అయింది. కాయలను ఇంటి వద్ద రాశిపోసి వర్షానికి తడవకుండా పట్టలు కప్పి, కాపాడుకుంటున్నాం. పంట దిగుబడి ఎకరాకి 7 క్వింటాళ్లు కూడా రావట్లేదు. వ్యాపారులు ఇంటి వద్దకు వచ్చి కాయలు లొత్తలుగా ఉన్నాయని 47 కిలోల బస్తా రూ.1800 అడుగుతున్నారు. ఆ ధరకే విక్రయిద్దామనుకున్నా.. మరసటి రోజు వ్యాపారులు రావడం లేదు. ఎలా అమ్ముకోవాలో అర్థం కావడంలేదు.

- గంగరాజు, రైతు, పెద్దమట్లగొంది

రూ.2వేలకే అమ్మేశా..



మూడెకరాల్లో వేరుశనగ పంట తొలగించా. 47కిలోల బస్తా ధర రూ.2800 నుంచి 3000 వరకు అమ్ముడుపోతుందని భావించా. వర్షాభావ పరిస్థితుల కారణంగా కాయలు లొత్తలుగా వచ్చాయి. వ్యాపారులు అడిగిన మేరకు 47 కేజీల బస్తా రూ.2 వేలకే విక్రయించా. మూడెకరాల్లో రూ.60 వేలు నష్టం వచ్చింది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేయాలంటే భయంగా ఉంది. - సురేంద్రయాదవ్, పెద్దమట్లగొంది

పంట వద్దకు పోతే కన్నీరే



నాలుగెకరాల్లో వేరుశనగ సాగుచేశా. రూ.2 లక్షల వరకు ఖర్చుచేశా. వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడులు రాలేదు. పంట తొలగించుకుని వచ్చిన దిగుబడి తీసుకుందామనుకుంటే తుఫాను కన్నీరు మిగిల్చింది. పొలంలో కాయలు మొలకెత్తుతున్నాయి. పంట మొత్తం ఇలాగే ఉంది. తొలగిస్తే పశుగ్రాసం దక్కదని దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నా. వర్షాలు తగ్గుముఖం పడితే తొలగించుకుంటా.

- బ్యాళ్ల చంద్రమోహన్, రైతు, పెద్ద మట్లగొంది

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి



వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ దిగుబడులు తగ్గాయి. కాయలు లొత్తలుగా ఉండడంతో వ్యాపారులు కొనుగోలు చేయట్లేదు. ప్రభుత్వమే రూ.3వేలు మద్దతు ధరతో కొనుగోలు చేసి, ఆదుకోవాలి.

- శ్రీనివాసులు, రైతు సంఘం నాయకుడు, చిన్నమట్లగొంది

పారా మెడికల్ కోర్సుల్లో చేరికలు



విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి

అనంతపురం వైద్యం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పారామెడికల్ కోర్సులలో ప్రవేశాలకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.

2025-26 విద్యా సంవత్సరానికి 150 సీట్లకుగాను 130మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. మిగిలిన సీట్ల భర్తీకోసం నవంబరు 7వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వివరాల కోసం ప్రభుత్వ వైద్య విద్య కళాశాలను సంప్రదించాలని సూచించారు.

78 మందికి కారుణ్య నియామకాలు



నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఒకేసారి 78 మందికి కారుణ్య నియామకాల కింద పోస్టులు ఇవ్వడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు- 62, సచివాలయానికి సంబంధించి 8పోస్టులు, క్లాస్-4 ఉద్యోగులుగా 8 మందిని నియమించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వీటపై కొత్త కలెక్టర్ ఆనంద్ దృష్టి సారించారు. వివిధ శాఖల నుంచి వచ్చిన కారుణ్య నియామకాల దరఖాస్తులన్నింటినీ పరిశీలించారు. శాఖల వారిగా ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో అన్వేషించి జాబితా తయారు చేశారు. ఆ మేరకు సంబంధిత పోస్టులను కారుణ్య నియామకం కింద భర్తీ చేయించారు.

భయం లేకుండా పనిచేయండి

ప్రభుత్వం, ప్రజల కోసం ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం కారుణ్య నియామకాలకు సంబంధించి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 78మందికి కారుణ్య నియామకాల పత్రాలను జేసీ శివనారాయణశర్మతో కలిసి కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పని చేసే అవకాశం తక్కువ మందికి దొరుకుతుందని, ఉద్యోగంలో రకరకాల ఇబ్బందులు, ఒత్తిళ్లు కూడా వస్తాయన్నారు. వీటన్నింటిని తట్టుకుని పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది సక్రమంగా పనిచేసి ఫైల్ పంపిస్తేనే ఉన్నత స్థాయిలో ఆమోదం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఏఓ అలెగ్జాండర్, అధికారుల తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పక్కాగా ఉండాలి: కలెక్టర్

అనంతపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ బుకింగ్‌లో సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని తాటిచెర్లలో ఈక్రాప్ బుకింగ్‌లో సూపర్ చెక్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ముందుగా గ్రామ పరిధిలోని రామగోపాల్ చెందిన సర్వే నెంబరు 308-3ఏలో 2.74ఎకరాల పొలంలో దానిమ్మ పంట సాగు చేయగా, ఈక్రాప్ బుకింగ్‌లో ఆయన సామాజిక తనిఖీ నిర్వహించారు. సుదర్శనాచారికి చెందిన సర్వే నంబరు 320-1బిలోని 1.07ఎకరాలో సాగు చేసిన నిమ్మపంట ఈక్రాప్ బుకింగ్ సామాజిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా సర్వే నంబర్లు, పంటల సాగు, విస్తీర్ణం, తదితర వివరాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఏఓ వెంకటకుమార్, ఉద్యాన శాఖ హెచ్‌ఓ రత్నకుమార్, వీఆర్వో మంజునాథ్, వీహెచ్ఏ గంపరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడికి ఆలస్యంగా గురువులు

ఈ ఏడాది ముఖహాజరును ప్రకటించిన రాష్ట్రశాఖ

నెలలో 10రోజులపాటు వేలమంది టీచర్ల లేటు

10,046 మందిలో 9435 మంది ఆలస్యంగా హాజరు



అనంతపురం విద్య, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వేళకు బడికి హాజరు కావాలంటూ ప్రభుత్వం ముఖహాజరు(ఎఫ్ఆర్ఎస్) తీసుకువచ్చినా అమలులో చాలా చోట్ల విఫలమవుతోంది. నిబంధన మేరకు ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉదయం 9గంటలలోపు ముఖహాజరు వేయాల్సి ఉంది. వారు పనిచేసే పాఠశాలలు, ఎమ్మార్సీల వద్దకు వెళితేనే హాజరు నమోదవుతుంది. కానీ చాలా మంది ఉపాధ్యాయులు వేళకు బడికి వెళ్లి ముఖహాజర వేయడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. ఈఏడాది జూన్12 నుంచి అక్టోబరు 28 వరకు ఉపాధ్యాయుల హాజరును రాష్ట్రశాఖ పరిగణనలోకి తీసుకుని రెండు రోజుల కిందట గణాంకాలు విడుదల చేసింది. ఎంతమంది ఎన్నిరోజులు సమయానికి వెళ్లి ముఖ హాజర వేస్తున్నారు? ఎంతమంది సమయం తర్వాత హాజరు వేస్తున్నారో లెక్కలు తీసి ప్రకటించింది. అనంతపురం జిల్లాలో విద్యాశాఖ లెక్కల మేరకు 10,046మంది ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లు ఉన్నారు. 968మంది నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో 1నుంచి 10 రోజులుపాటు 9435మంది ఆలస్యంగా హాజరై ముఖ హాజరు వేశారు. ఇలా వేలమంది నెలలో 10రోజులు ఆలస్యంగా డ్యూటీకి వెళుతుండటంపై రాష్ట్ర విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంది. ఆలస్యంగా ఏపాఠశాల టీచర్లు, హెచ్ఎంలు, ఏ మండల ఎంఈఓలు ముఖ హాజర వేశారో వారిపేర్లతో పాటు రాష్ట్రశాఖ వెల్లడించింది. 352మంది 11నుంచి 20రోజులుపాటు, 73మంది 21నుంచి 30రోజులు, 16మంది 41నుంచి 50రోజులు, 08మంది 51 నుంచి 60 రోజులు, ముగ్గురు 61నుంచి70రోజులు పాటు ఆలస్యంగా ముఖహాజరు వేసినట్లు రాష్ట్రశాఖ వెల్లడించింది. ఈజాబితాను పేర్లతో బయటపెట్టడంతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంపైనా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ ఐటీసెల్ సిబ్బంది ఆలస్యంగా హాజరు వేస్తున్నవారికి, అసలే హాజరవేయని వారికి ఫోన్‌లు చేసి హాజరుపై గట్టిగా చెబుతున్నారు. మొత్తం మీద ఈ ముఖహాజరు వ్యవహారం ఆశాఖలో తీవ్రదుమారం రేపుతోంది.

చర్యలు తప్పవు: డీఈఓ ప్రసాద్‌బాబు

ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్ల హాజరుపై కమిషనర్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఏఏ పాఠశాలలో ఎవరెవరు ఏ సమయంలో ముఖ హాజరు వేస్తున్నారు. అందులో ఆలస్యంగా ఎందరు వేశారో కూడా లెక్కలు తీసి జిల్లాకు పంపుతున్నారు. ప్రతి ఒక్కరు ఉదయం 9గంటల సమయానికి ముఖ హాజరు వేయాల్సిందే. 9.30గంటల తర్వాత ఎవరు హాజరు వేస్తున్నారో వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నాం. ఐటీసెల్ నుంచి ఆపాఠశాలకు ఫోన్‌చేసి ఆరా తీస్తున్నాం. పదేపదే హాజరులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.

చియా సాగును ప్రోత్సహించండి

ఏఆర్ఎస్ శాస్త్రవేత్త భాస్కర్‌రెడ్డి



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త

తనకల్లు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): చియా సాగును ప్రోత్సహించాలని ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త భాస్కర్‌రెడ్డి, కదిరి ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. మండలంలోని చీకటిమానిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్క జొన్న, కంది తదితర పంటలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. మొక్కజొన్నలో కలుపు నివారణ కొరకు అట్రాజిన్ వంటి మందులు పిచికారీ చేయాలన్నారు. ఉప్పునీరు మొక్కలపై పడకుండా పొలాలలో పిచికారీ చేయడం ద్వారా నత్తలను నివారించవచ్చన్నారు. చియా సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. రైతులు ప్రస్తుత రబీలో చియా సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ భారతి, ఏఈఓ కవిత, వీఏఏ సాయిప్రీతి, రైతులు కోటిరెడ్డి, వెంకటరమణారెడ్డి, మల్లెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

రామగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలో మూడు హుండీలు ఉండగా అందులో ఒక హుండీని గుర్తు తెలియని వ్యక్తులు దూరంగా తీసుకెళ్లి పగలకొట్టి అందులో డబ్బు, వస్తువులను చోరీ చేశారు. భక్తులు హుండీలోకి నగదుతోపాటు బంగారు వస్తువులు కూడా వేస్తుంటారు. రెండు నెలల కిందట హుండీ ఆదాయం లెక్కించగా రూ.2లక్షలకుపైగా ఆదాయం వచ్చింది. ఇప్పుడు కూడా రూ.1.5లక్షకు పైగా సొమ్ము ఉండవచ్చునని ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో విద్యుత్ పనులు చేస్తుండటం వల్ల సీసీ కెమెరాలు పని చేయలేదని ఈఓ తెలిపారు. రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



ధ్వంసమైన హుండీ

టమోటా కిలో రూ.24

అనంతపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు.

'సురక్ష'తో నాణ్యత పరిశీలన

ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య, ఏసీ చంద్రశేఖర్ రెడ్డి



కస్టమర్‌తో బాటిల్ స్కాన్ చేయిస్తున్న డీసీ, ఏసీ, ఇతర అధికారులు

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సురక్ష యాప్ ద్వారా వినియోగదారులే నేరుగా లిక్కర్ నాణ్యత పరిశీలించ వచ్చని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి బుధవారం వారు నగరంలోని పలు దుకాణాలు, బార్లలో తనిఖీలు చేపట్టారు. మద్యం నిల్వ ఎంత ఉంది..? భౌతికంగా ఎంత ఉంది. రికార్డుల్లో ఏ మేరకు ఉందో పరిశీలించారు. తర్వాత వారు మాట్లాడుతూ యాప్ ద్వారా స్కాన్ చేసిన తర్వాతే మద్యం విక్రయాలు చేయాలన్నారు. వినియోగదారులు సైతం తప్పనిసరిగా యాప్‌ను తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నకిలీ మద్యంపై నిరంతరం నిఘా పెట్టామన్నారు. ఎక్కడా జిల్లాలో బెల్ట్ దుకాణాలు లేకుండా విస్తృతంగా తనిఖీలు చేయాలని సీఐలను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఆర్ నుంచి నీటి విడుదల



సీబీఆర్ గేటు నుంచి విడుదలవుతున్న నీరు

తాడిమర్రి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు సీబీఆర్(చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)గేటు ఒకటి బుధవారం ఎత్తి నీటిని విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు తోడు పైవీఆర్ ప్రాజెక్టు నుంచి వస్తున్న నీటితో బుధవారం ఉదయానికి ఇన్‌ఫ్లో 3వేల క్యూసెక్కులకు పైగా పెరిగింది. దీంతో మధ్యాహ్నం సీబీఆర్ గేటు ఒకటి ఎత్తి 2వేల క్యూసెక్కులను పార్నపల్లి ఏటికి విడుదల చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎల్‌సీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ మరో మూడు రోజులపాటు వర్షాలు ఉన్నాయన్న హెచ్చరికల నేపథ్యంలో గేటు ఎత్తినట్లు తెలిపారు.

బీటీపీకి కొనసాగుతున్న వరద



నిండుకుండలా బీటీపీ రిజర్వాయర్

గుమ్మఘట్ట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భైరవాని తిప్ప ప్రాజెక్టులో గత నాలుగు రోజులుగా వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. కర్ణాటక ప్రాంతంలోని వాణివిలాస్ సాగర్ నుంచి మరువనీరు వేదావతి హగరినది ద్వారా 4,400 క్యూసెక్కుల మేర బీటీపీ రిజర్వాయర్‌కు చేరుతుండడంతో.. ఇరిగేషన్ అధికారులు నాలుగు గేట్లు ఎత్తి నాలుగువేల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదులుతున్నారు. వేదావతి హగరి పరివాహక ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బీటీపీ వద్ద పర్యాటకుల సందడి పెరుగుతోంది. దీంతో గుమ్మఘట్ట ఎస్ఐ ఈశ్వరయ్య పర్యాటకులు నది సమీపానికి వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దాసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యం

ఏ విభాగంలోనూ కుదురుగా లేని వైనం

ఎమ్మెల్యే తనిఖీలకు వచ్చినా అదేతీరు

రోగులకు తీవ్ర ఇబ్బందులు



పీడియాట్రిక్ ఓపీలో డాక్టర్ల కోసం ఎదురుచూపులు



సర్జరీ వార్డులోని మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం వైద్యం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డాక్టర్లు విధుల్లో నిర్లక్ష్యాన్ని యథావిధిగా కొనసాగించారు. సంతకాలు చేయడం, ఎఫ్ఆర్ఎస్ వేసి డ్యూటీలను ఎగ్గొట్టడం షరామూమూలే. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం ఉదయమే ఆసుపత్రి తనిఖీకి వచ్చారు. రాగానే ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్‌కు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతతో కలిసి ఓపీలు, వార్డులు, స్కానింగ్ సెంటర్ ఇలా ఆసుపత్రిలో కలియతిరిగారు. ఎమ్మెల్యే వచ్చే సమయానికి గైనిక్, సర్జరీ, పీడియాట్రిక్ విభాగాల్లో పీజీ విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఆప్తాలమిక్, ఈఎన్‌టీయూలో పీజీలతోపాటు కొందరు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన ఏ విభాగం ఓపీలో కూడా డాక్టర్లు లేరు. ఆయన విజిట్ చేసిన ప్రతి ఓపీలో ఎన్ని గదులున్నాయి, డ్యూటీ డాక్టర్లు ఎవరెవరు ఉన్నారు వంటి అంశాలను క్షుణ్ణంగా ఎమ్మెల్యే రాసుకున్నారు. ఎమ్మెల్యే విభాగాల వారిగా పరిశీలిస్తూ అక్కడి రోగులతో మాట్లాడారు. ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ ఓపీల్లో ఎమ్మెల్యే వెళ్లే సమయానికి డాక్టర్లు లేరు. అప్పటికే సమాచారం తెలియడంతో ఎమ్మెల్యే వెళ్లిన తరువాత పరుగులుపెడుతూ కొంతమంది డాక్టర్లు వచ్చారు. ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఆత్మారామ్, డాక్టర్ ఇర్షాద్ అహ్మద్ ఓపీకి చేరుకున్నారు. సర్జరీ ఓపీలో డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ శివశంకర్ నాయక్ వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు. ఎమ్మెల్యేను కలవడానికి డాక్టర్ ఆత్మారామ్ ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదు. మరోవైపు సర్జికల్ ఓపీలోని డాక్టర్లు శివశంకర్, మధుసూదన్ రోగులను చూసి వెళ్లిపోయారు. అత్యధిక మంది ఎమ్మెల్యే ఆసుపత్రి దాటగానే విధుల్లోనుంచి వెళ్లిపోయారని రోగులు మండిపడ్డారు.

రోజువారిగానే పనిచేస్తాం...

వార్డులు, ఓపీల డ్యూటీలు చేయాల్సిన డాక్టర్లు బుధవారం కూడా రోజువారిగానే పనిచేశారు. డాక్టర్లు ఆసుపత్రి ఆవరణంలో ఎఫ్ఆర్ఎస్ వేసి జంప్‌కాగా మరికొందరు డాక్టర్లు, విభాగాధిపతులు మధ్యాహ్నం 12గంటలకే ఇంటిముఖం పట్టారు. ఆర్థోవిభాగం పరిశీలిస్తే.. ఓపిలో 12గంటల వరకే రోగులను పరీక్షించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 3గంటల వరకు డాక్టర్లు ఎవరూ రాలేదు. ఒక విద్యార్థి మాత్రమే కుర్చీలోకూర్చుని వెళ్లిపోయారు. ఆపరేషన్ థియేటర్‌లో 8 మందికి ఆపరేషన్లు చేయాల్సి ఉండగా హెచ్ఓడీ డాక్టర్ ఆత్మారాం అర గంటకే ఓటీ నుంచి వెళ్లిపోయారు. మరోవైపు డాక్టర్ ఆనంద్ నాయక్ ఇద్దరు రోగులకు ఆపరేషన్ చేసి 12 గంటలకు వెళ్లిపోయారు.

చర్యలు తప్పవు : ఎమ్మెల్యే

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. పెద్దాసుపత్రిని తనిఖీచేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్లో నిర్లక్ష్యం చర్యలు తప్పవని డాక్టర్లను హెచ్చరించారు. ఉదయం 9.30 గంటలైనా డాక్టర్లు ఓపీలకు రాలేదన్నారు. ఓపీలు, వార్డులు, ఫార్మసీ, రేడియాలజీ తదితర విభాగాలన్ని పరిశీలించానని తెలిపారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నానని వివరించారు. 560 పడకలుగా ఉన్న పెద్దాసుపత్రిని త్వరలోనే 1200 పడకలకు మారుస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ల కోసం నిరీక్షించి చివరకు ఇలా..

డాక్టర్లు అందుబాటులో లేరు..



మా ఆయన అంజినప్ప కడుపునొప్పితో బాధపడుతూ కూర్చోలేకపోతున్నాడు. నల్లమాడ నుంచి అనంతపురం బస్సు ఎక్కి పెద్దాస్పత్రికి వచ్చేసరికి మధ్యాహ్నం అయింది. ఓపి చీటీ తీసుకుంటే 8వ నెంబర్‌లోని సర్జరీ విభాగానికి వెళ్లమన్నారు. ఇక్కడికొస్తే డాక్టర్లులేరు.

-నరసమ్మ, నల్లమాడ

డాక్టర్ కోసం ఎదురుచూడలేక...

వారం నుంచి బాగలేకపోవడంతో డాక్టర్ కోసం అనంతపురం వచ్చాం. ఓపి 8లో డాక్టర్ వద్దకు వెళ్లమన్నారు. ఇక్కడేమో డాక్టర్లు లేకపోవడంతో ఎదురుచూడలేక పడిపోయాను. అడ్మిషన్ చేసుకుని ఆపరేషన్ చేస్తారని తాడిపత్రి నుంచి వచ్చాం. సాయంత్రం 3 గంటలైనా పెద్దడాక్టర్ రాలేదు.

-బాలకంబయ్య, తాడిపత్రి

అడ్మిషన్ బుక్‌చేతిలో పెట్టారంతే..



తొమ్మిది నెలల గర్భవతిగా పెద్దాసుత్రిలోని యాంటినేటల్ ఓపీకి వచ్చాను. ఉదయం డాక్టర్లు చూసి పరీక్షలు చేశారు. అడ్మిషన్ చేస్తామని బుక్ తెచ్చుకోమన్నారు. సాయంత్రం 3 గంటలైనా బుక్‌చేతిలో పెట్టారంతే. ఎప్పుడు వార్డుకు పంపుతారో తెలియక ఓపిలోనే కూర్చున్నా.

-శ్రావణి, గుంతకల్లు

రైతులను ఆదుకోవాలి

సబ్సిడీ పప్పుశనగ సకాలంలో అందేలా చూడాలి

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్, సభ్యులు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంతోపాటు సకాలంలో సబ్సిడీ విత్తన శనగ పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మను జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సభ్యులు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత జడ్పీ మాజీ చైర్మన్ రెడ్డప్పరెడ్డి మృతికి నివాళులు అర్పించారు. అనంతరం వ్యవసాయ శాఖ ప్రగతిపై వివరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మను కోరారు. ఆమె జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రగతిని వివరించే ప్రయత్నం చేశారు. అర ఎకరాకు ప్యాకెట్ చొప్పున సబ్సిడీతో విత్తన శనగ పంపిణీ చేస్తున్నామనీ, అవసరం ఉన్నవారికి అంతకంటే ఎక్కువగా కూడా ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. దీంతో స్పందించిన బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ జిల్లాలో అవసరాలకు అనుగుణంగా పప్పుశనగ పంపిణీ చేయలేదన్నారు. జిల్లాలో వర్షాభావంతో వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయిందన్నారు. కంది పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పప్పుశనగ వేద్దామనుకుంటే విత్తనాలు అందించకపోతే ఎలాగని ప్రశ్నించారు. మరిన్ని సరఫరా చేసేలా రాష్ట్ర శాఖకు ప్రతిపాదనలు పంపామనీ, ఉన్నతాధికారుల మేరకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి చేప్పే ప్రయత్నం చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. ముందస్తు ప్రణాళికతో సకాలంలో విత్తన శనగ అందిస్తేనే రైతులకు ప్రయోజకరం అన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతులు పంట నష్టపోతే వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదికలు పంపి రైతులకు అండగా నిలవాల్సి ఉందన్నారు. రైతులే.. అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా పట్టించుకోవడం లేదనీ, ఇది సరికాదన్నారు. సమస్య తలెత్తకుండా చూస్తామని వ్యవసాయశాఖాధికారి తెలియజేశారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి మాట్లాడుతుండగా.. పలువురు సభ్యులు శిశుగృహాల్లో ఘటనలపై ప్రశ్నించారు. పీడీ మాట్లాడుతూ.. అందుకు బాధ్యులైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వారి నుంచి వివరణ తీసుకుని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పలువురు ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యానిమేతర్

- మహిళ సొమ్ము కాజేసిన యానిమేటర్
- రూ.4లక్షల మేర స్వాహా
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

యల్లనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళల పొదుపు సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా ఓ యానిమేటర్ సొంతానికి వాడుకున్న ఘటన మండలంలోని మల్లాగుండ్ల గ్రామంలో జరిగింది. డ్వాక్రా సంఘం సభ్యురాళ్లు, పోలీసులు తెలిపిన మేరకు లక్ష్మీనరసింహ మహిళా పొదుపు సంఘంలో 12మంది సభ్యులుగా ఉన్నారు. వీరి పొదుపు సంఘానికి మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో పొదుపు ఖాతా ఉంది. మూడేళ్ల కిందట తీసుకున్న రుణానికి ప్రతినెలా ఒక్కో సభ్యురాలు రూ.3వేలు చొప్పున వాయిదా చెల్లిస్తున్నారు. దీనికి అదనంగా కొంత సొమ్మును పొదుపు ఖాతాకు కూడా జమ చేస్తున్నారు. గ్రామానికి చెందిన యానిమేటర్ తానే సంఘం సొమ్మును బ్యాంక్‌లో జమ చేస్తానని సభ్యురాళ్ల నుంచి డబ్బు తీసుకొనేవాడు. మూడునెలల నుంచి సంఘానికి సంబంధించిన రుణం, పొదుపు పుస్తకాలను ఇవ్వాలని సభ్యులు అడగడంతో ఆ యానిమేటర్ తనవద్ద లేవని బుకాయించాడు. కనీసం కంతు కట్టినట్లు బ్యాంక్ రశీదులు చూపించాలని అడిగినా తన వద్ద లేవన్నాడు. దీంతో అనుమానం, ఆందోళనతో ఆ సంఘం సభ్యులు బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. కంతుల డబ్బులు సరిగా జమ చేయడం లేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో వారు హతాశులయ్యారు. సుమారు 11 వాయిదాల మేర డబ్బు బ్యాంక్‌లో కట్టలేదని మహిళా సభ్యురాళ్లు ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.4లక్షల మేర ఆ యానిమేటర్ వాడుకున్నట్లు ఆరోపించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యానిమేటర్‌ను పిలిపించి మాట్లాడుతామని పోలీసులు బాధిత మహిళా సభ్యురాళ్లకు తెలిపారు. ఈ విషయంపై ఏపీఎం ముత్యాలప్పను వివరణ కోరగా బ్యాంకు రుణానికి సంబంధించి తమకు ఎటువంటి సమాచారం రాదన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

జువైనల్ హోంకు మైనర్ తరలింపు

10 తులాల బంగారం.. 1250 గ్రాముల వెండి స్వాధీనం

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి, వారిలో ఒక మైనర్‌ను జువైనల్‌హోంకు తరలించినట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో కొత్తచెరువు అప్‌గ్రేడ్ సీఐ మారుతీశంకర్‌తో కలసి వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా రామభద్రాపురానికి చెందిన వడిసిన వేణుగోపాల్‌రెడ్డి, సోమవరప్పాడు గ్రామానికి చెందిన చిన్నం ఆదెమ్మ, ఓ బాలుడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చోరీ చేసేవారని తెలిపారు. పుట్టపర్తి ప్రాంతానికి వచ్చి ఒక ఇంటిని అద్దెకు తీసుకుని పగలు రెక్కినిర్వహించి, రాత్రిపూట చోరీలకు పాల్పడుతుండేవారని వివరించానారు. ఇందులో వేణుగోపాల్‌రెడ్డి ఇటీవలే తాళ్లూరు, పొదలిలో గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడని తెలిపారు. జైలు నుంచి బయటకు రాగానే పుట్టపర్తికి మకాం మార్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడేవాడని అన్నారు. కొత్తచెరువులో నివసిస్తున్న విశ్రాంత ఉద్యోగి మేమల శాంతమ్మ ఇంట్లో ప్రవేశించి 20 గ్రాములు బంగారం ఆభరణాలు చోరీ చేశారని తెలిపారు. మంగళవారం స్థానిక ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్ ఆవరణంలో వీరిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. వీరి నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు, 1250 గ్రాముల వెండి సామగ్రి, కారు, బైక్, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు వడిసిన వేణుగోపాల్‌రెడ్డిపై విజయవాడ, ఖమ్మం, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, హైదరాబాద్‌లోని పోలీసుస్టేషన్లలో 11 కేసులు నమోదయ్యాయని తెలిపారు. దొంగలముఠాను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన కొత్తచెరువు యూపీఎస్ సీఐ మారుతీశంకర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందిని డీఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు.

కారుడ్రైవర్ ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పట్టణానికి చెందిన కారు డ్రైవర్ ఊర్లకుంట శ్రీనివాసులు(48) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు..పట్టణంలోని సిద్ధయ్యగుట్ట ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు సొంతకారును డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కారు కొనుగోలుకు ఫైనాన్స్, ఇతరుల వద్ద అప్పులు చేశాడు. కారు బాడుగలు సక్రమంగా రాకపోవడం, కుటుంబ ఆర్థిక సమస్యలతో తీవ్రంగా ఇబ్బంది పడేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కారు కోసం వేసిన షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పెద్దన్న (ఫైల్)

యల్లనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు పెద్దన్న (72) బుధవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. పెద్దన్న భార్య చంద్రమ్మతో కలిసి ఉదయం 10గంటలకు ఇంటి నుంచి పొలానికి వెళ్లారు. వీరికి ఉన్న ఒకటిన్నర ఎకరా పొలంలో మొక్కజొన్న, వరి పంటలు సాగు చేస్తున్నారు. పొలంలో చంద్రమ్మ పనిచేస్తుండగా పెద్దన్న మోటారు ఆన్ చేయడానికి బోరు వద్దకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేయడానికి విద్యుత్‌వైర్లు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు ఒకవైరు మీదపడటంతో విద్యుత్ ప్రవాహం జరిగి అక్కడికక్కడే చనిపోయాడు. పెద్దన్న ఎంతసేపటికి రాకపోవడంతో భార్య బోరు వద్దకు వెళ్లింది. విగతజీవిగా పడిఉన్న భర్తను చూసి బోరుమంటూ కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. పెద్దన్నకు వివాహితులైన ఇద్దరు కుమారులతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గుజరాత్ దొంగల అరెస్టు



దొంగల అరెస్టు చూపుతున్న బీకేఎస్ పోలీసులు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడియంపేట వద్ద ఉన్న కేశవరెడ్డి, నారాయణ, గ్లోబల్ పాఠశాలలో జరిగిన చోరీ కేసుల్లో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఈ నెల 6న మండలంలోని పలు కార్పొరేట్ పాఠశాలల్లో దుండగులు చొరబడి రూ.2లక్షల నగదు చోరీచేశారు. పలు కోణాల్లో విచారణ జరిపి అనుమానితులను గుర్తించామన్నారు. ఈక్రమంలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన రవిపవార్ అలియాస్ పట, భరత్‌రాజారామ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. చోరీలో ప్రధాన నిందితుడైన మనోహర్ పవార్ అలియాస్ ఆకెక్స్‌తో మరో ఇద్దరు దొంగలు పరారీలో ఉన్నారన్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ప్రస్తుతం దొరికిన ఇద్దరు దొంగలకు కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కాగా పరారైన వారి వద్దే దింగిలించిన సొమ్ము మొత్తం ఉందని పోలీసులు తెలిపారు.

సోలార్ ప్లాంట్‌లో చోరీ

గుత్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పారిశ్రామిక వాడలో ని సోలార్‌ప్లాంట్‌లో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు టెక్నీషియన్ వెంకటరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.ఏడు లక్షల విలువైన రాగి తీగలను చోరీ చేసినట్లు తెలిపాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



మల్లికార్జున (ఫైల్)

పెనుకొండ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై హరిపురం క్రాస్ వద్ద బైకు అదుపుతప్పి కింద పడి మల్లికార్జున(19) అనే యువకుడు మృతిచెందాడని కియ ఎస్ఐ రాజేష్ తెలిపారు. చిలమత్తూరుకు చెందిన నరసయ్య కుమారుడు మల్లికార్జున బెంగళూరు బొమ్మనహళ్లిలో ఎయిర్‌టెల్ కంపెనీ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. బైక్‌పై బెంగళూరు నుంచి మంగళవారం అనంతపురం వెళ్లి స్నేహితులను కలిశాడు. తిరిగి బుధవారం తెల్లవారుజామున బెంగళూరుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. బైకు డివైడర్‌ను ఢీకొట్టడంతో మల్లికార్జున అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలను పర్యవేక్షిస్తున్న వీసీ

అనంతపురంరూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏలో అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్ స్కీం కింద చేపట్టిన ఇంటర్వ్యూలు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అధ్యక్షతన వివిధ విభాగాల ఆచార్యులకు ఉద్యోగోన్నతి కోసం ఇంటర్వ్యూలు చేపట్టారు. సబ్జెక్టు నిపుణులు ఈ ఇంటర్వ్యూలు చేశారు. కార్యక్రమంలో డీఏపీ ఆచార్య సత్యనారాయణ, ప్యానల్స్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి



భౌతికకాయంపై పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సలకంచెరువు ఆదినారాయణ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత వెంటనే ఆ గ్రామానికి చేరుకుని ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు బాలాజీ, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూములను కాపాడుకుందాం: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

అనంతపురం రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): కబ్జాదారుల నుంచి భూములను కాపాడుకుందామంటూ సీపీఐ నాయకులు బుధవారం పాపంపేటలో భూముల రక్షణ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ.. పాపంపేట శ్రోత్రియం భూముల జీపీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 31వ తేదీన సాయంత్రం 4గంటలకు ఇక్కడి జొన్నా ఐరన్ మార్ట్‌వద్ద పెద్ద ఎత్తున బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారన్నారు. భూముల సమస్యతో బాధపడుతున్న ప్రజలంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రమేష్, రూరల్ మండల కార్యదర్శి నరేష్, సహాయకార్యదర్శి దుర్గాప్రసాద్, రాప్తాడు నియోజకవర్గ ఏఐవైఎఫ్ కార్యదర్శి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

రామగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో గల మహాత్మాజ్యోతిబా పూలే బాలురగురుకుల పాఠశాలలో బుధవారం నక్కినవారిపల్లిలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ప్రైవేటు సంస్థ వారు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు, పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. పవర్‌గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు అహుడాలో ఫిర్యాదుల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం 10 గంటలకు ఫిర్యాదులను స్వీకరిస్తామని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ బుధవారం తెలిపారు. లే అవుట్లు, ఇతర సమస్యలు ఉన్న వారు అర్జీలు ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ బంగ్లా సమీపంలోని అహుడా కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శింగనమల జిల్లాపరిషత్ పాఠశాలకు పూర్వ విద్యార్థులు బుధవారం సౌండ్ సిస్టం విరతణ చేశారు. 1987-88వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ పాఠశాలకు రూ.65 వేలు విలువగల సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. అలాగే అదే బ్యాచ్‌కు చెందిన రెల్వే పోలీసు సుధాకర్‌యాదవ్ ఆటోమెటిక్ ఎలక్ట్రానిక్ చెల్లును హెచ్‌ఎం చంద్రకళకు అందించారు. పూర్వ విద్యార్థులు హరినాథ్, అగజాల చంద్రశేఖర్, మునెప్ప కుళ్ళాయప్ప, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరం ఏర్పాటు చేయాలని వినతి

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఎంపీడీఓ భాస్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎంపీడీఓ స్పందించి తప్పకుండా ఇక్కడ ఆధార్ క్యాంపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన

అనంతపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కురుగుంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా బుధవారం ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులు, పోషణ అభియాన్, సూపర్ జీఎస్టీ, సైబర్ సెక్యూరిటీ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను వివరించారు. అలాగే జువాలజీ విభాగం అధ్యాపకులు, ఆర్ఆర్‌సీ-ఐఆర్‌సీఎస్ సమన్వయకర్త గిరిధర్, బోటనీ విభాగ అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ.. పోషణ అభియాన్, దీర్ఘకాలిక వ్యాధుల నివారణ, మైభారత్ పోర్టల్, ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కౌన్సిల్ సమావేశం రసాభాస

- మేయర్, కమిషనర్ మధ్య తీవ్ర వాగ్వాదం
- శానిటేషన్, కుక్కలు, రోడ్లపైనే ప్రధాన చర్చ
- నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- అనంతను స్మార్ట్‌సిటీగా మారుస్తామన్న ఎంపీ అంబికా



కౌన్సిల్‌లో మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి వాగ్వాదం



హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనంత నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ, వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్న ఈ సమావేశాన్ని మహ్మద్ వసీం ప్రారంభించగా... కమిషనర్ బాలస్వామి అజెండాతో చర్చను ప్రారంభించారు. పారిశుధ్యం, కుక్కల బెడద, రోడ్ల సమస్యపైనే అధిక సమయం చర్చించారు. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. వైసీపీ సభ్యులు నగరంలో పారిశుధ్య నిర్వహణ చాలా అధ్వానంగా ఉందని.. అలాగే రోడ్లన్నీ ఛిద్రమయ్యాయని.. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, దీనికి కమిషనర్ సమధానం చెప్పాలని కోరారు. ఇప్పటికే చాలా రోడ్లు వేశామని...ప్రాధాన్యత క్రమంలో రోడ్లను బాగుచేస్తామని కమిషనర్ చెప్పుకొచ్చారు. అలాగే ఉదయమే మద్యం షాపులు ఓపెన్ చేస్తున్నారని, దీంతో మహిళలు ఆయా రూట్లలో వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఎక్సైజ్ అధికారులను పిలిపించాలని మేయర్, వైసీపీ సభ్యులు పట్టు పట్టగా కమిషనర్ జోక్యం చేసుకుని నగరంలో ఎక్కడా ఉదయమే వైన్‌షాపులు తెరవడం లేదని, ఎక్సైజ్ అధికారులను ఇక్కడికి పిలిపించలేమని, తనకు ఆ అధికారం లేదని, విషయం అయితే చేరవేస్తానని సమాధానం చెప్పారు. ఇక కుక్కల సమస్యపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు కమిషనర్ స్పందిస్తూ హర్యాణాకు చెందిన స్నేక్ ఇంటర్నేషన్ ఏజెన్సీ ద్వారా అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) ఆపరేషన్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని చెప్పుకొచ్చారు. ఇలా సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకు కమిషనర్ బాలస్వామి సమాధానాలిస్తూ సభను ముందుకు నడిపించారు.

మేయర్, కమిషనర్ మధ్య తీవ్ర వాగ్వాదం..

మేయర్, కమిషనర్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. బదిలీపై వెళ్లిన టీపీఓ శిరీష అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని.. వెంటనే పిలిపించి వివరణ ఇవ్వాలని మేయర్ సూచించగా.. అందుకు కమిషనర్ స్పందిస్తూ బదిలీపై వెళ్లిన ఉద్యోగులను పిలిపించే అధికారం తనకు లేదని చెప్పారు. దీంతో మేయర్ మీరు ఉద్యోగులకు వత్తాసు పలుకుతున్నారంటూ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు అవసరానికి అనుగుణంగా ఓ న్యాయవాదిని నియమించుకోవడం పట్ల కూడా మేయర్ తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఇక్కడ పనిచేయడం ఇష్టం లేకపోతే వేరే చోట చూసుకోవాలని మేయర్ చేసిన వ్యాఖ్యలకు.. ఉచిత సలహాలు అవసరం లేదని కమిషనర్ సమాధానమిచ్చారు.

మేయర్ వర్సెస్ ఎమ్మెల్యే..

గత ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉన్నా.. నగరంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన 16నెలల్లోనే సుమారు రూ. కోట్ల వ్యయంతో నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను మేయర్ వ్యతిరేకించారు. దీంతో ఇద్దరి మధ్య కాసేపు మాటల యద్ధం జరిగింది. డంపింగ్‌యార్డు పేరుతో కోట్లాది రూపాయలను స్వాహా చేశారని, అదే డంపింగ్‌యార్డును ఖాళీ చేసే ప్రక్రియను తాము ప్రారంభించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తమ హయాంలో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని మేయర్ చెప్పడంతో మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విజిలెన్స్ విచారణతో వైసీపీహయాంలో జరిగిన అక్రమాలపై నిగ్గుతేల్చుతామని, అప్పుడు సమాధానం చెప్పండని మేయర్‌పై ఎమ్మెల్యే మండిపడ్డారు.

సోమనాథ్‌నగర్ బ్రిడ్జిని నిర్మించాలి: కోగటం

సమావేశంలో డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నో ఏళ్లగా ఉన్న సోమనాథ్‌నగర్ బ్రిడ్జిని నిర్మించి ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. అలాగే బళ్లారి రోడ్డు పైభాగంలో వర్షం పడితే నగరంలోని జనశక్తి నగర్, రజకనగర్, సోమనాథ్‌నగర్, రంగస్వామినగర్‌లలోకి నీరు చేరి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, వారి సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. ఇక రామ్‌నగర్, మారుతీనగర్‌ల నుంచి నడిమి వంకలోకి రెండు కాలవలను నిర్మించి వరద నీటిని నేరుగా వంకలోకి వచ్చేలా చూడాలని తెలిపారు.

నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే దగ్గుపాటి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. తాము నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని 16నెలల్లోనే చేసి చూపించామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డంపింగ్‌యార్డుకి శాశ్వతపరిష్కారం చూపిన ఘనత సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానిదన్నారు. గత అక్టోబరు 2 గాంధీజయంతి నాటికి డంపింగ్‌యార్డులో బయోమైనింగ్ పూర్తి కావాల్సి ఉండగా వర్షం కారణంగా డిసెంబరు చివరి నాటికి పూర్తి చేస్తామని చెప్పామని, అలాగే 12 ఎకరాల్లో ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసి నగర వాసులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తామని, అలాగే లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

స్మార్ట్ సిటీగా మార్చడానికి కృషి చేస్తా: ఎంపీ అంబికా

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చడానికి, గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా మార్చడానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. వర్షాకాలంలో వరదల నుంచి నగరానికి విముక్తి కల్పించేందుకు కాలవల నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తే స్థానిక ఎమ్మెల్యేతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న వాటర్ ట్యాక్స్ రికవరీకి కార్పొరేటర్లు సహకరించాలన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో బస్సు షెల్టర్ల ఏర్పాటుకు నిధులు ఇస్తామని, అశోకచక్రం, వాల్మీకిమహర్షి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు.

అవిశ్వాసం నెగ్గేనా..?

- నేడు బీకేఎస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం
- టీడీపీ శిబిరంలోకి వైసీపీ ఎంపీటీసీ?
- 12మందికి తగ్గిన జగన్ పార్టీ బలం

బుక్కరాయసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అవిశ్వాస తీర్మానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత ఎంపీపీ దాసరి సునీత పదవి ఉండేనా ఊడేనా అనే చర్చ మండలవ్యాప్తంగా జరుగుతోంది. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే వైసీపీకి 13మంది ఎంపీటీసీల బలం కావాలి. అయితే వైసీపీకి ఉన్న 13మంది ఎంపీటీసీల్లో ప్రస్తుతం క్యాంపు శిబిరంలో 12మందే ఉన్నారు. వైసీపీకి చెందిన ఎంపీటీసీ శిరిజా గత ఐదు రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారు. దీంతో ఈమె సమావేశానికి హాజరవుతారా? హాజరైతే ఎవరికి మద్దతు తెలుపుతారనే సందిగ్ధం నెలకొని ఉంది. కాగా ఎంపీటీసీ శిరిజా టీడీపీ శిబిరంలో చేరినట్లు వైసీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఆమెను వైసీపీ నేతలే టీడీపీ శిబిరంలో చేర్పించారనే చర్చ జరుగుతోంది. ఈక్రమంలోనే వైసీపీ సమన్వయ కర్త సాకే శైలజానాథ్ స్థానిక వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరో వైపు సిద్దరాంపురం టీడీపీ ఎంపీటీసీ సాకే నాగలక్ష్మి తొలుత టీడీపీ శిబిరానికి వెళ్లలేదు. అనంతరం పార్టీలోని ప్రముఖ నేతలు చొరవ తీసుకుని ఆమె వైసీపీ శిబిరంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రస్తుతం ఆమెకు ఇద్దరు మహిళా పోలీసులు భద్రత కల్పిస్తున్నారు.

నేడు అవిశ్వాస తీర్మానం

ఎంపీపీ దాసరి సునీతపై వైసీపీ ఎంపీటీసీలు ప్రకటించిన అవిశ్వాస తీర్మానంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం జరగనుంది. మొత్తం 19 మంది ఎంపీటీసీలలో 2/3 వంతు మంది అంటే 13 మంది ఎంపీటీసీలు వ్యతిరేకంగా ఓటు వేస్తేనే ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. 13 మంది ఎంపీటీసీలు కంటే తక్కువ ఉంటే కోరం లేదని అధికారులు సమావేశాన్ని రద్దు చేసే అవకాశం ఉంది. అయితే వైసీపీ ఎంపీటీసీ శిరిజాను కిడ్నాప్ చేశారని వైసీపీ నాయకులు గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేసే అవకాశం ఉన్నట్లు ఆపార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై, బందోబస్తు ఏర్పాటు చేశాయి.

పోలీసు విధులపై అవగాహన



విద్యార్థులకు సీసీ కెమెరాల పనితీరుపై వివరిస్తున్న సీఐ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ, ఇతర పోలీసుల విధుల గురించి విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లలో అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని పలువురు విద్యార్థులను 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బుధవారం పిలిపించారు. స్టేషన్‌లో ఎంత మంది పోలీసులు ఉంటారు, ఏయే స్థాయి అధికారులు ఉంటారు, రిసెప్షన్ సెంటర్, స్టేషన్‌హౌస్ ఆఫీసర్ కార్యాలయం, వీహెచ్‌ఎఫ్ సెట్, డయల్ 100, 110 పనితీరు, కేసుల నమోదు, తుపాకీలు, నగరంలోని ట్రాఫిక్, ఇతర సమస్యలను సీసీ కెమెరాల ద్వారా ఎలా తెలుసుకుంటారో విద్యార్థులకు పోలీసులు వివరించారు.

డీపీఓలో సెమినార్...

జిల్లా పోలీస్ కార్యాలయంలో 'పోలీసుల త్యాగాలు' అనే అంశంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు సెమినార్‌లో పాల్గొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ ప్రధాన వక్తగా హాజరయ్యారు. పోలీసు అమరవీరుల దినోత్సవం ప్రాముఖ్యత, పోలీసుల సేవలు, వారి త్యాగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు బాబ్జాన్, మగ్బూల్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

అనంతపురం అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని లలిత కళాపరిషత్‌లో ఈనెల 31వ తేదీన నిర్వహించే ఓసీ విద్యార్థి యువగర్జన మహాసభను విజయవంతం చేయాలని ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మహాసభకు ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డిని, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను, ఓసీ సంఘాల నాయకులను ఆహ్వానించామన్నారు. ఓసీల్లో కూడా పేదలు ఉన్నారని, వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఓసీ విద్యార్థులు వలసలు పోవడం తదితర అంశాలపై సభలో చర్చిస్తామన్నారు. ప్రతి ఓసీ విద్యార్థి తరలిరావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమలానగరలో గల సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆసంస్థ అధినేత, ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మీ బుధవారం ప్రకటనలో తెలిపారు. నవంబరు 3వతేదీ వరకు దరకాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులందరికీ అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ కార్యాలయంలో దరకాస్తులు అందజేయాలని కోరారు.

ముగిసిన శిక్షణ తరగతులు

రామగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆదాయ వనరులను పెంపొందించడంపై మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గత మంగళవారం ప్రారంభించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఇందులో ఎంపీడీఓ గంగావతి మాట్లాడుతూ.. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంపొందించడంపై దృష్టి సారించాలన్నారు. ఇంటి, కొళాయిల పన్నులే కాకుండా గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు, మార్కెట్లు తదితర వాటి నుంచి గ్రామస్థులను కలుపుకుని ఆదాయ వనరులను పెంచాలన్నారు. తర్వాత వాటితో పంచాయతీలను అభివృద్ధి చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ రాజేంద్ర, సర్పంచ్‌లు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

● శింగనమల: పంచాయతీల్లో ఆదాయ వనరుల పెంపుదలపై శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి. రెండో రోజు అధికశాతం ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. సర్పంచులు అలా వచ్చి ఇలా వెళ్లిన పరిస్థితి కనబడింది. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్,పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● నార్పల: పంచాయతీల్లో ఆదాయ వనరుల పెంపుపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన శిక్షణ ముగిసింది. ఎంపీడీఓ మమతాదేవి, డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషారెడ్డి, పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చదువుతోనే ప్రత్యేక గుర్తింపు

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

రాప్తాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చదువుతో ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని గోళ్లపల్లి సమీపంలో గల మాంటిస్సోరి ఎలైట్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల అధ్యాపకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బాగా చదువుకున్న వ్యక్తి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. దేశ భవిష్యత్ మార్చగలిగే శక్తి విద్యార్థుల చేతిలో ఉందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని బాగా చదువుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిభ కనబరిస్తేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ప్రణాళిక ప్రకారం చదివి లక్ష్యం చేరుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరికీ క్రమశిక్షణ చాలా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీ కృష్ణ భరత్, కరెస్పాండెంట్ కృష్ణ సమీరా, ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురంఅర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. స్థానిక కృషి భవన్‌లో బుధవారం ఆమె అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ వెంకట్‌కుమార్‌తో కలిసి అనంతపురం అర్బన్, రూరల్ పరిధిలోని ఎరువుల డీలర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దుకాణాల్లో రైతులు కొనుగోళ్లకు సంబంధించి రసీదును తప్పని సరిగా ఇవ్వాలన్నారు. ఎమార్పీకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రతి దుకాణాలంలో ధరల పట్టికలతోపాటు స్టాక్ వివరాలు ప్రదర్శించాలన్నారు. డీబీటీలో కొత్తగా మార్పులు వచ్చాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఓటీపీ ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు విక్రయించాలన్నారు. ఒక ఆధార్‌పై ఎక్కువ మోతాదులో ఎరువులు ఇవ్వకూడదన్నారు. ఈ విషయాలపై డీలర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు వృథా

● సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించలేని కౌన్సిల్ సమావేశాలు వృథా అని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి విమర్శించారు. నగరపాలక సంస్థలో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలోకి సీపీఎం నాయకులు దూసుకొచ్చి ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి బయటకు వెళ్లాలని చెప్పగా... ఆందోళనకారులు ససేమిరా అన్నారు. దీంతో వారి మధ్య తోపులాట.. వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఆందోళనకారులు బయటకు వచ్చి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో గుంతల రోడ్లు దర్శనమిస్తున్నా.. పట్టించుకునేవారే కరువయ్యారన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవించే దుస్థితి నెలకొందన్నారు. సోమనాథ్‌నగర్‌లో బ్రిడ్జి కూలేందుకు సిద్ధంగా ఉందని, దానిని కూల్చివేసి కొత్త బ్రిడ్జి నిర్మించాలని చెబుతున్నా ఎవరూ వినడం లేదని మండిపడ్డారు. నడిమివంకకు ప్రొటెక్షన్‌వాల్ నిర్మించి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. డంపింగ్‌యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రకాష్, ముర్తుజా, మసూద్, వలీ, ఇర్ఫాన్, ఓబులేసు, వెంకటేష్, రాజు, గఫూర్, రామాంజనమ్మ, శంకర్, కుమార్, ఇజ్రాయిల్, ఇస్మాయిల్, ఆది, అజాం, హాజీవలి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై గందరగోళాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లండి

● ఎమ్మెల్యే దగ్గుపాటికి ఆప్టా నాయకుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆప్టా నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి చేయడంపై టీచర్లలో గందరగోళం, ఆందోళన నెలకొన్నాయని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని ఆప్టా నాయకులు ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌ను కోరారు. నగరంలో బుధవారం వారు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. డీఎస్సీ ఉత్తీర్ణత సాధించిన తర్వాతనే ఉపాధ్యాయ పోస్టింగ్‌లోకి వచ్చారన్నారు. ఇపుడు మళ్లీ టెట్ రాయాలని, అందులో ఉత్తీర్ణత పొందాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు అంటూ నోటిఫికేషన్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. దీంతో 30ఏళ్లకు పైగా సర్వీస్ చేసినోళ్లు, 50ఏళ్ల వయసు పైబడినోళ్లు ఆందోళన చెందుతున్నారన్నారు. అందుకే సర్వీస్‌టీచర్లకు టెట్ వద్దని అండగా నిలిచి కోర్టులో రిట్‌పిటీషన్ వేసేలా సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.

ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు తగవు

అనంతపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రపై అసత్య ఆరోపణలు మానుకోవాలని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ గౌడ్ అన్నారు. ఆ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రిన్సిపాల్‌పై కొంతమంది వ్యక్తులు ప్రజా సంఘాల ముసుగులో లేనిపోని ఆరోపణలు చేస్తూ మానసిక క్షభకు గురి చేస్తున్నారన్నారు. బాధ్యత గల ప్రజా సంఘాల్లో ఉంటూ దుర్బుద్ధితో మాట్లాడటం సరికాదన్నారు. మరోసారి ఇలా వ్యవహరిస్తే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య సూచనల మేరకు న్యాయస్థానానికి వెళతామని హెచ్చరించారు.

క్రీడాకారులకు సన్మానం

అనంతపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): త్రోబాల్ క్రీడాకారులకు రాచానపల్లి పంచాయతీ బీఎస్ఆర్ కాలనీ వాసులు ఘన సన్మానం చేశారు. బుధవారం కాలనీలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి వారినాగరాజు, టీడీపీ నాయకులు రాయల్ మధుతో పాటు కాలనీ వాసులు క్రీడాకారులను సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..గుజరాత్‌లో జరిగిన 33వ జూనియర్ బాలుర, బాలికల జాతీయ త్రోబాల్ చాంపియన్ షిప్ 2025లో కాలనీకి చెందిన రంజిత్, ప్రభు వరమ్‌నాయక్, సాజిద్ హుస్సేన్, దర్శితారెడ్డి, ప్రీతి, హర్షిత పాల్గొని ప్రతిభ చాటారని తెలిపారు.


టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు, డైరెక్టర్లు

టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

తాడిపత్రి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్ బ్యాంక్‌లో డైరెక్టర్ల స్థానాలకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. తొమ్మిది స్థానాలకు తొమ్మిది మందే నామినేషన్లు వేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఇస్మాయిల్ తెలిపారు. కో-ఆపరేటివ్ అధ్యక్షుడిగా కుమ్మర రామయ్యను మిగిలిన ఎనిమిది మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇక దుర్గంలో పశువుల సంత

మార్కెట్ యార్డు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ వెల్లడి



కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో ఇక ప్రతి శుక్రవారం గొర్రెల సంత, ప్రతి శనివారం పశువుల సంత నిర్వహిస్తామని మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్ తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డులో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రైతులు, వ్యాపారులు పశువుల సంత కోసం పావగడ, అనంతపురం, ఉరవకొండ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో ఇక పశువులను సంతను స్థానిక మార్కెట్ యార్డులోనే నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ కుబేర యాదవ్, ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ కేశవకుమార్ పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరుడిగా బుగ్గ రామలింగేశ్వరుడు



తాడిపత్రి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం శ్రీశక్తిసహిత నీలకంఠేశ్వర అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకున్నారు.

శ్రీధరఘట్టలో చెత్త తొలగింపు


చెత్తను తొలగిస్తున్న టీడీపీ నాయకుడు

బొమ్మనహాళ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీధరఘట్టలో రైతు సేవ కేంద్రం నుంచి హైస్కూల్ వరకు రోడ్డు పక్క చెత్త చెదారం నిల్వ ఉండేది. వర్షాలకు ఆ చెత్త కుళ్లి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను ఆ స్కూల్ హెచ్‌ఎం కౌసల్య టీడీపీ సగర సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రసాగర్ దృష్టికి తీసుకెళ్లింది. ఆయన సొంత ఖర్చుతో ఆ చెత్తను తొలగించారు.

రోడ్డును బాగు చేసుకున్న రైతులు


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న రైతులు

బెళుగుప్ప, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం పంచాయతీ కృష్ణానగర్‌కు ఉన్న మట్టి రోడ్డు ఇటీవల వర్షాలకు బాగా దెబ్బతింది. దీంతో ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. రైతులు స్వంత ఖర్చులతో ట్రాక్టర్లతో ఎర్రమట్టి తరలించి.. బుధవారం ఆ రోడ్డును బాగుచేసుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం


చెక్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బెళుగుప్ప, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోణంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ప్రమీలమ్మ, ఏజీ శ్రీనివాసరెడ్డి, హరికృష్ణ యాదవ్, శరత్ కుమార్ రూ. 1.60 లక్షలను విరాళంగా ఇచ్చారు. ఆ చెక్‌ను వారు బుధవారం ఆ పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు

కుళ్లిన పంటలు


కుళ్లిన పప్పుశనగ పంట

ఉరవకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులను మొంథా తుఫాన్ నిండా ముంచేసింది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఖరీఫ్, రబీలో సాగు చేసిన వేరుశనగ, కంది, పప్పుశనగ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని ఇంద్రావతి, చిన్న ముష్టూరు, పెద్దముష్టూరు, ఆమిద్యాల గ్రామాల్లో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు వేరుశనగ కట్టె తడిసి కుళ్లింది. దీంతో కాయలు బూజుపట్టాయి. పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోయింది. ఈ వర్షాలకు కంది పూత రాలిపోయినట్లు రైతులు వాపోతున్నారు. పొలాల్లోకి వర్షపునీరు చేరి పప్పుశనగ పంట కూడా కుళ్లిపోయినట్లు తెలిపారు. ఎకరాకు రూ.20వేల దాకా నష్టం వాటిల్లిందని వారు వాపోతున్నారు.

నేడు మంత్రి పర్యటన

ఉరవకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం ఉరవకొండలో పర్యటిస్తారు. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటిస్తూ.. సమస్యలపై ఆరాతీస్తారు.

వ్యాసరచన పోటీలో హేమలత ప్రతిభ



కణేకల్లు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో నియోజకవర్గస్థాయిలో రాయదుర్గంలో బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఐదు మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని యర్రగుంట పాఠశాలకు చెందిన హేమలత మొదటి బహుమతి సాధించింది. ఎంఈఓలు లక్ష్మణ, భవానీ శంకర్ హేమలతకు బహుమతి అందజేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

తాడిపత్రి, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక పొలిమేర పెద్దమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఉగాది పండుగ నుంచి దసరా పండుగ వరకు (ఆరునెలలు) ఆదాయాన్ని లెక్కించగా రూ.1,49,270 వచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ రవీంద్రారెడ్డి, బుజ్జిస్వామి, దబ్బర బాబు, మురుగన్ బాలు, ప్రసాద్, భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు

కూడేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బ్రహ్మణపల్లి సమీపంలోని 93 సర్వేనంబర్‌లో అక్రమంగా వేసుకున్న కొట్టాలను బుధవారం తొలగించారు. తహసీల్దారు మహబూబ్‌బాషా, సీఐ రాజు ఆధ్వర్యంలో పోలీసులు వాటిని తొలగించారు.

అభివృద్ధి పనులకు రూ.7.8 కోట్లు మంజూరు

రాయదుర్గం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వైద్య, ఆరోగ్యానికి సంబంధించి అభివృద్ధి పనులకు రూ. 7.80 కోట్లు మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్ డీఈ సుధాకర్‌నాయక్ బుధవారం తెలిపారు. విప్ కాలవ శ్రీనివాసులు ప్రతిపాదన మేరకు డీ.హీరేహాళ్ మండలంలో పులకుర్తి, కణేకల్లు -1, 3, బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం, గోవిందవాడ, ఉద్దేహాళ్ గ్రామాల్లో హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణానికి ఒక్కొక్కటికి రూ. 42 లక్షల ప్రకారం మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధుల కింద బీఎన్ హళ్లి, మాల్యం, సొల్లాపురం గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణం కోసం ఒక్కొక్కదానికి రూ. 36 లక్షలు మంజూరయ్యాయన్నారు. అలాగే నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిన 24 హెల్త్ సబ్‌సెంటర్‌ల పూర్తిస్థాయి నిర్మాణాలకు ఎన్‌హెచ్‌ఎం కింద రూ. 3.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి అనుమతి

బొమ్మనహాళ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏళంజి గ్రామంలో దాదాపు 20 ఏళ్లుగా శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీఈశ్వరస్వామి దేవాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాటి అభివృద్ధిని కొందరు అడ్డుకొంటున్నారు. దీంతో ఆ గ్రామస్థులు సమస్యను తహసీల్దార్ మునివేలు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బుధవారం ఆ ఆలయాలను పరిశీలించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి అందరూ సమ్మతించేలా చేశారు. దీంతో ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

విత్తన పప్పుశనగ కేటాయింపు

పుట్లూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రబీసీజన్‌లో సాగుకు మండలానికి 2,200 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలను కేటాయించినట్లు మండల వ్యవసాయాధికారి కాత్యాయిని బుధవారం తెలిపారు. ఆ విత్తనాలను త్వరలో రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తామన్నారు.

ఓటరు జాబితాను సరిచేయండి

రాయదుర్గం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రచురించిన ఓటరు జాబితా డోర్ నెంబర్ల ప్రకారం వరుసక్రమంలో ఉండేలా చూడాలని జిల్లా టీడీపీ కన్వీనర్ వెంకటరమణబాబు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం

తాడిపత్రి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో ఏఎస్పీ రోహిత్ కుమార్‌చౌదరి, సీఐలు, ఎస్‌ఐలతో సహా మొత్తం 150 మంది పోలీసులు, స్థానికులు రక్తదానం చేశారు.

కూలిన మట్టిమిద్దెలు

యల్లనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రెండు మట్టిమిద్దెలు కూలాయి. కోట వీధిలోని విజయ్‌కు చెందిన మట్టిమిద్దె, వెంకటరమణస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న బాషా మట్టిమిద్దె బుధవారం తెల్లవారుజామున కూలిపోయాయి. ఇందులో ఎవరూ గాయపడలేదు.


పడిపోయిన మట్టిమిద్దెలు

యువకుడి మృతి


భాస్కర్ (ఫైల్)

డీ.హీరేహాళ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): లోబీపీతో కిందపడి తీవ్రంగా గాయపడ్డ హోసగుడ్డం గ్రామానికి చెందిన కురుబ రామన్న కుమారుడు భాస్కర్ (17) మరణించాడు. ఇతను బళ్లారిలోని ఒక మెడికల్ షాపులో పని చేసేవాడు. ఇతనికి లోబీపీ సమస్య ఉంది. బుధవారం తన ఇంటికి వచ్చిన భాస్కర్... లోబీపీతో కిందపడటంతో వెన్నెముక వద్ద తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తిగత కక్షలతోనే గొడవలు: డీఎస్పీ

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులో వ్యక్తిగత కక్షలతోనే మంగళవారం గొడవలు జరిగాయని, ఈ గొడవల్లో రాజకీయ కోణం లేదని డీఎస్పీ రవిబాబు స్పష్టంచేశారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాతలింగ, నరేష్ మద్యం మత్తులో గోవిందప్ప, అతని అనుచరులను దుర్భాషలాడారని, ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, రాళ్లతో దాడి చేసుకున్నారని తెలిపారు. ఇరువర్గాల వారూ గాయపడ్డారని, వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించామని తెలిపారు. పాతలింగ, మరికొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందన్నారు.

సమన్వయలోపంతో వివాదం

తాడిపత్రి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక విజయనగర్‌కాలనీకి చెందిన సచివాలయ ఉద్యోగిని ఓటీపీ కోసం తన పరిధిలోని ఓ ఉపాధ్యాయుడికి ఫోన్ చేసింది. అయితే తాను సచివాలయ ఉద్యోగిని అని చెప్పకుండా ఓటీపీ అడగడంతో.. ఆ ఉపాధ్యాయుడు.. ఆమెతో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తన భర్తకు విషయం తెలపడంతో.. వివాదం నెలకొంది. ఈ వివాదం పోలీస్‌స్టేషన్‌కు బుధవారం చేరడంతో వారు ఇరువురికి సర్ధిచెప్పి పంపారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన

గుత్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనపై పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అవినీతి నిరోధక శాఖ సీఐ హమీద్‌ఖాన్ విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ర్యాగింగ్, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఈఓ ఇంతియాజ్‌బాషా పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లో 1,440 క్యూసెక్కులు

బెళుగుప్ప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 1,440 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 1,440 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం వెల్లడించారు. రిజర్వాయర్‌లో 1.749 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.